క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 13, వంకాయ 28, బెండ 60, పచ్చి మిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజీ 9, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 19, దొండ 28–35, చిక్కుడు 60, గోకర 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 50, ఆలు 21, దోస 28, సొర 13, పొట్ల 10, ఉల్లి 22, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



ఆర్టీసీ సూపర్‌వైజర్స్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధిలో ముందుండి పనిచేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని ఆర్టీసీ సూపర్‌వైజర్స్‌కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో మిగిలిపోయిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆరు నెలల్లో పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ నేతలు వెంకటేష్, భీష్మాచారి, పుల్లయ్య, రాంరెడ్డి, సూర్యప్రకాష్, శంకరయ్య, సుదర్శన్, నాయకులు కదారి యాదగిరియాదవ్, కొండల్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంలో జాగ్రత్తలపై అవగాహన



మహిళకు సేఫ్టీ కిట్‌ను అందజేస్తున్న శ్రీనివాస్

హస్తినాపురం: వంటగ్యాస్ వినియోగంలో మహిళలు తగు జాగ్రత్తలు పాటించినట్‌లైతే ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఉండదని రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎం.కె.రాథోడ్ అన్నారు. బుధవారం హస్తినాపురంలోని శ్రీనివాస ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష సే సమృద్ధి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు సురక్షా పైపులను ఎప్పటికప్పుడు టైం ప్రకారం మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండేన్ ఆయిల్ డీజీఎం ఎస్.బాలాజీ, శ్రీనివాస ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కాసుల శ్రీనివాస్ మహిళలకు సేఫ్టీ కిట్‌లను అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మజ్లిస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో అక్బర్‌బాగ్, ఆజంపుర, సైదాబాద్, చవుని, ఓల్డ్‌మలక్‌పేట డివిజన్లకు చెందిన 15 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. లబ్ధిదారులకు రూ. 5.67 లక్షల విలువ కలిగిన చెక్కులు అందజేశామని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చైతన్యపురి: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజమల్ల నాగమల్లు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని భాష్యం విద్యాసంస్థ హైస్కూల్ విద్యార్థుల క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెరిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, రిలే పరుగు పోటీలను నిర్వహించారు. విజేతలకు పాఠశాల జోనల్ ఇంచార్జి అంకమ్మరావు, ఇన్‌స్పెక్టర్ నాగమల్లు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి, దిల్‌సుఖ్‌నగర్ జోన్–3 బ్రాంచిల ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

- అర్హులందరూ ఓటు హక్కును కలిగి ఉండాలి
- ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు పాత్ర కీలకం
- పలు ప్రాంతాల్లో విద్యార్థులకు అవగాహన
- జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుని ప్రజలు సుపరిపాలనతో లబ్ధి పొందాలని పలువురు పిలుపునిచ్చారు. బుధవారం మలక్‌పేట్ నియోజకవర్గంలోని పలు కాలనీలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులు, అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ... పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని కోరారు. భావిపౌరులైన యువత, విద్యార్థులకు ఇప్పటి నుంచే ఎన్నికలు, రాజ్యాంగం తదితర అంశాలపై అవగాహన పెరగాలన్నారు. నేటి విద్యార్థులే భావి పౌరులని, రాబోయే ఎన్నికల్లో వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థుల తమ తల్లితండ్రులు, బంధువులు, చుట్టుపక్కల వారిని చైతన్యం చేయాలని సూచించారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేసే ముందు సరైన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలన్నారు. అనే ఆయుధంతో పాలకులను ప్రశ్నించవచ్చన్నారు. కుల, మత, ప్రాంతాలు అనే భేదాలు లేకుండా పరిపాలనాదక్షులను ఎన్నుకోవాలన్నారు.

యువత ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి: కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్: రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కు ప్రాధాన్యతను యువత గుర్తించాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి కోరారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఐఎస్‌సదన్‌లోని సంగం లక్ష్మీబాయి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అందరూ ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వజ్రాయుధంలా పనిచేస్తుందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అందరం ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకుంటామని, ఓటు హక్కు తప్పక ఉపయోగించుకుంటామని కళాశాల విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, శరత్‌చంద్రగౌడ్, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ కార్యాలయంలో...



ఎల్‌బీనగర్ కార్యాలయం వద్ద ప్రమాణం చేయిస్తున్న డీసీలు మారుతీదివాకర్, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య

ఎల్‌బీనగర్: ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని ఈఆర్‌ఓ, హయత్‌నగర్ సర్కిల్ డీసీ ఎ.మారుతీదివాకర్, ఏఈఆర్‌ఓలు ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల డీసీలు బి.సురేందర్‌రెడ్డి, హెచ్.కృష్ణయ్య అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ తన ఓటు హక్కును వినియోగించుకుంటామని సిబ్బందితో ప్రమాణం చేయించారు. ఈఈలు కె.రమేష్‌బాబు, కోటేశ్వర్‌రావు, శ్రీనివాసులు, డిప్యూటీ సిటీ ప్లానర్ సుష్మిత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాబస్తీలో కలుషితనీటి సమస్యను పరిష్కరించాలి



డ్రైనేజీ సమస్యను ఉపేందర్‌రెడ్డికి వివరిస్తున్న ప్రజలు

దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్‌నగర్ బంజారా బస్తీలో మంచినీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సి.ఉపేందర్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ బంజారాబస్తీలో నల్లాల్లో డ్రైనేజీల నుంచి మురుగు నీరు కలిసి కలుషితమై వస్తోందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి బస్తీకి వెళ్లి సమస్య తీవ్రతను పరిశీలించారు. బస్తీ ప్రజలతో సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి రమేష్ నేత, బి.మహేందర్, శ్రీకాంత్, శ్రీశైలం, విజయ్, జహంగీర్, జగదీష్, నగేష్, బస్తీ నేతలు భాస్కర్ నాయక్, ప్రేమ్ నాయక్, హరి నాయక్, దశరథ నాయక్, రవి నాయక్, బాలు నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయి ఆలయంలో ‘శ్రీవసంత పంచమి’

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో శ్రీసరస్వతి మాత పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు శ్రీవసంత పంచమిని నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వూర సర్సింహగుప్తా తెలిపారు. బాబా సన్నిధిలో జరిగే శ్రీ సరస్వతి మాత పూజా కార్యక్రమాన్ని విద్యార్థినీవిద్యార్థులతో నిర్వహిస్తామన్నారు.

నేడు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

చంపాపేట: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి తెలిపారు. పూజకు అవసరమైన సామగ్రి పాఠశాల నిర్వాహకులే అందజేస్తారన్నారు. ఆసక్తి ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు ఉదయం పది గంటలకు పాఠశాలకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ప్రమాదకర విద్యుత్ వైర్లను మార్చాలి

కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్



విద్యుత్ ఏడీకి వినతిపత్రస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే మార్చాలని కొత్తపేట కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. కొత్తపేట గ్రామంలో కిందకు వేలాడుతున్న తీగలను ముట్టుకున్న రితీష్ అనే బాలుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కొత్తపేటలో పర్యటించారు. రితీష్ ఇంటికి వెళ్లి వారి చిన్నారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం కొత్తపేట విద్యుత్ కి సంబంధించిన విద్యుత్ శాఖ ఏఈ జాన్సన్ పిలిపించి బస్తీలో ప్రమాదకరంగా ఉన్నటు తీగలు, స్తంభాలను మార్చాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ పవన్ కుమార్ డీఈ కార్యాలయానికి వెళ్లి డీఈ రామకృష్ణ కలసి కొత్తపేటలో జరిగిన సంఘనను వివరించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని భరత్ నగర్, రాజీవ్ గాంధీనగర్, కొత్తపేట విలేజ్ వివిధ కాలనీలలో కిందకు వరిగిన పాత కరెంట్ స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్న తీగలను మార్చాలని కోరారు. అక్కడే ఉన్న ఏడీ తిరుపతయ్యకు సమస్యను వివరించి వినతి పత్రం సమర్పించారు. నాయకులు కొర్లపలి స్వామి, సుందర్ నారాయణ, రామకృష్ణ, కొత్త తిరుమల్, గట్టు మహే ష్, వెంకట్‌రెడ్డి, శివనేత, శరణ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రపురి కాలనీలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- ఏడు ఇళ్లల్లో చోరీలు
- 20 తులాల బంగారం, 25 తులాల వెండి అభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

నాగోలు: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఏడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ సంఘటన మంగవారం అర్ధరాత్రి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ వెనుక... విజయవాడ జాతీయ రహదారికి దగ్గర ఉన్న చంద్రపురికాలనీలో రోడ్ నెం.2లో నివాసం ఉండే మధురిమ ఈ నెల కుటుంబ సభ్యులతో కలసి చెన్నైకి వెళ్లింది. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు నడుచుకుంటూ చంద్రపురికాలనీలో వచ్చారు. మధురిమ ఇంటి మెయిన్ డోర్ బయట నుంచి తాళం వేసి ఉండటాన్ని గమనించారు. దీంతో వారి ఇంట్లోకి వెళ్లి పక్క గదిలో కిరాయికి ఉండే సాయికిరణ్ తలుపు బయట నుంచి గడియ పెట్టి మధురిమ ఇంటి తాళం పగలగొట్టి వారి ఇంట్లో ఉన్న 10 తులాల బంగారు, 25 తులాల వెండి అభరణాలు, రూ. 75 వేల నగదు చోరీ చేశారు. అదే కాలనీలో నివాసం ఉండే పర్వతం పవన్‌కుమార్, అతని భార్య కన్నా శాంతి వనంలు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగల గొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 10 తులాల బంగారం, రూ. 55 వేల నగదు కన్పించలేదు. అదే కాలనీలో నివాసం ఉండే వెంకట్‌రెడ్డి, నేపాల్‌రెడ్డి, మల్లికార్జున్, చారీ ఇండ్లలో ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో చోరీ పాల్పడ్డారు. మరి కొంత నగదు, ల్యాప్‌టాప్, 2 సెల్ ఫోన్‌లు చోరీ చేసుకుని పారిపోయారు. అర్ధరాత్రి దాటిన తరువాత 2:15 గంటల ప్రాంతంలో దొంగల వచ్చినట్లు సీసీ కెమెరాల ఫుటేజ్‌లో నమోదై ఉంది. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో మధురిమ ఇంట్లో కిరాయి ఉంటే సాయి కిరణ్ తన గది మెయిన్ డోర్ బయట నుంచి గడియా పెట్టి ఉండటాన్ని గమనించి పక్క వారి సహాయంతో గది నుంచి బయటకు వచ్చి తన యజమానికి మెయిన్ డోర్ తాళం పగుల గొట్టి ఉండటం గమనించి వారి సమాచారం ఇచ్చాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, డీఐ ఉపేందర్‌రావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ... దుండగులను త్వరలో పట్టుకుంటమన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరస్తుల కోసం ఎస్‌ఓటీ, సీసీఎస్, క్రైమ్ టీమ్స్ పనిచేస్తున్నాయని, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తుమని తెలిపారు.

ఇతర రాష్ట్ర ముఠా పనే...

◆ చంద్రపురికాలనీలో జరిగిన వరుస దొంగతనాలకు పాల్పడిన నేరస్తులు ఇతర రాష్ట్రానికి చెందిన నేరస్తులుగా పోలీసులు భావిస్తున్నారు. గతంలో నగరంలో కూకట్‌పల్లిలో సైతం ఇదే తరహా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ పాత నేరస్తుడు, కర్ణాటకకు చెందిన మరో పాత నేరస్తుడు కలసి చోరీ చేసినట్లు ప్రాథమికంగా పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది ఇందులో బ్రూస్‌లీ అనే వ్యక్తి ప్రాధాన నేరస్తుడని.. గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిసింది.



ఇంట్లో చిందరవందరగా వేసిన వస్తువులు



ఇంటి నుంచి బయటకు వస్తున్న దుండగులు

గణతంత్ర సంబురాలకు సర్వం సిద్ధం

వాడవాడలా జాతీయ జెండాలను ఎగురవేసేందుకు ఏర్పాట్లు

దిల్‌సుఖ్‌నగర్: మువ్వన్నెల జెండా ఎగురవేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అంతటా గణతంత్ర దినోత్సవ సంబురాలకు సర్వం ముస్తాబైంది. గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఎగుర వేసేందుకు వేదికలను సిద్ధం చేశారు.

◆ ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీల కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, జాతీయ జెండా ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకుకేందుకు స్థానికులు ఉత్సాహంతో ఏర్పాట్లను పూర్తి చేశారు. తమ ప్రాంతాలలోని జాతీయ జెండాలను ఎగుర వేసేందుకు స్వాతంత్ర సమరయోధులను, ఉన్నత అధికారులను, ప్రజా ప్రతినిధులను, వివిధ పార్టీల, సంఘాల నాయకులకు ఆహ్వానాలు పంపారు. దీంతో ఎక్కడ చూసినా పండగ వాతావరణ కనిపిస్తోంది. చంచల్‌గూడ జైలులో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

‘రవీంద్రభారతి’లో అలరించిన ఫ్యాన్సీడ్రెస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రెస్‌లో చిన్నారులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం ప్రైమరీ విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ కాంటెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ నాయకుల ఆహార్యాలతో ఆహుతులను అకట్టుకున్నారు. గాంధీజీ, భగత్‌సింగ్, చాచానెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, ఆజాద్ చంద్రశేఖర్, అల్లూరి సీతారామరాజు, రవీంద్రనాథ్ ఠాకూర్, ఝాన్సీలక్ష్మీ బాయి, బాబాసాహెబ్ అంబేడ్కర్, సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ తదితర జాతీయ నేతల వేషధారణల్లో చిన్నారులు సందడి చేశారు. ఈ సందర్భంగా జోనల్ డీన్ జ్యోతి మాట్లాడుతూ... చిన్నారుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించేందుకు.. అలనాటి స్వాతంత్ర్య పోరాట పటిమను వివరించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



బీటీరోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: కాలనీలు, బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సైదాబాద్‌లోని లోకాయుక్త కాలనీలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. కాలనీలో నిర్మించిన బీటీ రోడ్డును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. అనంతరం కార్పొరేటర్ కల్యాణ్ నగర్, మూడుగుళ్ల చౌరస్తాల వద్ద నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, నర్సింగ్‌రావు, శ్రీలత, పావని, లీల, స్వాతి గోవింద్ రాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల

ఉపాధ్యాయులకు తీరని నష్టం

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోర్దన్‌యాదవ్



చంపాపేట: విద్యాశాఖ అధికారులు, పాలకుల అనాలోచిత చర్యల వల్ల పూర్వపు రంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోందని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో భార్యాభర్తలు ఒకేచోట విధులు నిర్వహించుకోవచ్చనే నిబంధనలను అడ్డం పెట్టుకుని ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు రంగారెడ్డి జిల్లాకు బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ స్పౌజ్ పేరిట బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో భర్తీ అవుతాయని ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న బీఎడ్ అభ్యర్థులకు నిరాశ ఎదురవటమే కాకుండా జిల్లాలో పని చేస్తున్న టీచర్లకు పదోన్నతులు, హెచ్‌ఆర్‌ఏను కోల్పోవటం వంటి నష్టాలు జరుగుతాయని ఆవేదన వ్యక్త చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్వపు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధాయులకు మాత్రమే స్పౌజ్ నిబంధనలను వర్తింప చేయాలని ఆయన కోరారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఓ వరం

మంత్రి సబితాఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరంలా ఉపకరిస్తోంని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఎండీ గౌస్ కాళ్ల నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాడు. నిమ్స్ హాస్పిటల్‌లో వైద్యం కోసం రూ. లక్ష అవసరం. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలసి సమస్యను వివరించారు. వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. లక్ష ముందస్తు చెక్కు తెప్పించి బుధవారం బాధితుడు ఎండీ గౌస్‌కు ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్, రామిడి రాంరెడ్డి, కామేష్‌రెడ్డి, బాలరాజ్, పవన్ యాదవ్, జంగయ్య యాదవ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



గౌస్‌కు ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

దివ్యాంగుల స్టేడియానికి మోక్షం ఎప్పుడో?



పిచ్చిమొక్కలతో నిండిన స్టేడియం ప్రతిపాదిత ప్రాంతం

చాదర్‌ఘాట్: మలక్‌పేట సంక్షేమ భవనంలోని ఖాళీ స్థలంలో దివ్యాంగుల కోసం స్టేడియం నిర్మించేందుకు అధికారులు, చైర్మన్ సర్వేలు చేయించారు. ఉన్నతాధికారులకు ప్రతిపానలూ పంపారు. అయినా ఇప్పటి వరకు అది కార్యరూపం దాల్చలేదు. సంవత్సరం గడుస్తున్నా స్టేడియం నిర్మాణానికి మోక్షం రావడంలేదని పలువురు దివ్యాంగ సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్, జేఎండీ రోజూ స్థలాన్ని చూస్తూ వెళ్తున్నారే తప్ప స్టేడియం నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా చైర్మన్, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే స్టేడియం నిర్మాణాన్ని ప్రారంభించి సత్వరమే పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా వసతులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రోజు రోజుకు కొత్తకాలనీలు పెరుగుతున్నాయని.. ఆయా ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెల్లడించారు. వసతుల కల్పన దిశగా అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బుధవారం హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలిసి అధికారులతో డివిజన్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డ ఇమాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని కాలనీలలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఆయా ప్రాంతాలలో పర్యటించి నివేదిక సమర్పించాలన్నారు. కాలనీలలో నూతన రోడ్లను, మంచినీటి పైప్ లైన్‌ల ఏర్పాటు, విద్యుత్ త్రీఫేస్ కరెంట్ అవసరమో గుర్తించి వాటిని తన దృష్టికి తీసుకొస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు మంజూరు అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో అత్యుత్తమ నియోకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు శ్రీనివాస్‌నాయక్, దేరింగుల కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, ఉదయ్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, అధికారులు కోటేశ్వరరావు, కనకయ్య, బలరాంరాజు, శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి